సాక్షి
కాకినాడ

ఆదివారం | 28 | సెప్టెంబర్ | 2025



రూ.1.70 లక్షల విరాళం

తొండంగి: రత్నగిరిపై సత్యదేవుని నిత్యాన్నదాన ట్రస్టుకు బాదం చక్రవర్తి, సీతామహాలక్ష్మి దంపతులు (కోరుకొండ మండలం గాదరాడ) శనివారం రూ.1.70 లక్షల విరాళం సమర్పించారు.



నిత్యాన్నదానానికి రూ.59 వేలు

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి రాయపురెడ్డి అఖిల్ సాయి శ్రీరామ్ (అమలాపురం) శనివారం రూ.59 వేల విరాళం సమర్పించారు.

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: ఖరీఫ్ సాగు అవసరాల నిమిత్తం కాటన్ బ్యారేజీ నుంచి శనివారం గోదావరి డెల్టాలకు 10,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,900, సెంట్రల్ డెల్టాకు 1,400, పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు.

న్యూస్‌రీల్

లలితాదేవిగా తలుపులమ్మ తల్లి



లలితాదేవి అలంకరణలో తలుపులమ్మ తల్లి

తుని రూరల్: లోవ దేవస్థానంలో కొలువై ఉన్న తలుపులమ్మ అమ్మవారిని శరన్నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని ఆరో రోజైన శనివారం శ్రీ లలితాదేవిగా అలంకరించారు. అమ్మవారిని భవానీ భక్తులు దర్శించి, సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఆదివారం మహాచండీదేవిగా అమ్మవారిని అలంకరించనున్నట్లు వేదపండితులు తెలిపారు.

వేలాదిగా.. శృంగార వల్లభుని దర్శనానికి..



విశేష అలంకరణలో శృంగారవల్లభ స్వామి

పెద్దాపురం: తొలి తిరుపతి గ్రామంలో స్వయంభువుగా వెలసిన శృంగార వల్లభ స్వామివారిని సుమారు 30 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవలు, కేశఖండన టికెట్లతో పాటు అన్నదాన విరాళాలు కలిపి స్వామివారికి రూ.4,77,983 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ తెలిపారు.

పుష్కర ఘాట్‌లో ఇద్దరి గల్లంతు





గల్లంతైన బాపిరాజు, వీరబాబు (పాత చిత్రాలు)

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): గోదావరిలో స్నానానికి దిగిన ఇద్దరు భవానీ భక్తులు గల్లంతైన సంఘటన స్థానిక పుష్కర ఘాట్‌లో చోటు చేసుకుంది. గోకవరం మండలం పెంటపల్లికి చెందిన గుబ్బల బాపిరాజు (28) వాచ్‌మెన్‌గా పని చేస్తూ రాజమహేంద్రవరంలో ప్రస్తుతం నివసిస్తున్నాడు. రాజానగరం మండలం శ్రీరాంపురానికి చెందిన అతడి బావమరిది రాయుడు వీరబాబు (25) హైదరాబాద్‌లో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. భవానీమాల వేసుకోవడానికి అతడు ఇటీవల ఇంటికి వచ్చాడు. బాపిరాజు, వీరబాబు కుటుంబ సభ్యులతో కలసి శనివారం సాయంత్రం రాజమహేంద్రవరం పుష్కర ఘాట్‌కు వచ్చారు. అక్కడ బాపిరాజు, వీరబాబు స్నానానికి దిగారు. నది లోతు ఎంత ఉందో తెలియక ఊబిలో దిగి ఇద్దరూ గల్లంతయ్యారు. వారి కోసం త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పారావు ఆధ్వర్యాన ఎస్సైలు, సిబ్బంది స్థానిక మత్స్యకారులతో గాలింపు చేపట్టారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాబోయ్! బకాయిలు



- డీసీసీబీలో రూ.730 కోట్ల మొండి బకాయిలు
- ఏటా పెరగడమే తప్ప తగ్గుదలే లేదు
- రైతులకు రుణాలు ఇచ్చేందుకు అవస్థలు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): అప్పులివ్వడమే తప్ప వసూళ్లకు ఎటువంటి చర్యలూ లేకపోవడంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ)లో కోట్లాది రూపాయల మేర మొండి బకాయిలు పేరుకుపోతున్నాయి. ఫలితంగా రైతులకు రుణాలిచ్చేందుకు డబ్బులు లేక బ్యాంకు ఇబ్బందులు ఎదుర్కొంటోంది. రైతులకు అప్పు ఇచ్చేందుకు కూడా దిక్కు లేని స్థాయికి పరిస్థితి దిగజారిపోయింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలోని 50 సహకార బ్యాంకులు, సుమారు 300 సహకార సంఘాల ద్వారా రైతులకు అడిగిన వెంటనే పంట రుణాలతో పాటు దీర్ఘకాలిక రుణాలు కూడా అందించేవారు. గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పుల వసూళ్లపై నిర్లక్ష్యం చూపారు. ఫలితంగా డీసీసీబీలో రూ.730 కోట్ల మేర మొండి బకాయిలు పేరుకుపోయాయి. దీంతో, ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులకు రుణాలు ఇచ్చేందుకు పలుమార్లు తిప్పించుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

సేల్ ఆఫీసర్ల నియామకానికి చర్యలు



డీసీసీబీలో రుణాల వసూళ్లకు సేల్ ఆఫీసర్లు లేరు. దీంతో, బ్యాంకు ఉద్యోగులకే ప్రత్యేక శిక్షణ ఇచ్చి, సేల్ ఆఫీసర్లుగా నియమించి, రుణాలు వసూలు చేసేందుకు చర్యలు చేపట్టాం. బకాయిల వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాం.

– ప్రవీణ్‌కుమార్, ఇన్‌చార్జి సీఈఓ, డీసీసీబీ, కాకినాడ

కూటమి సర్కారు వచ్చాక..

సాగు పెట్టుబడికి గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు సహకార బ్యాంకు ఒక్కటే ఆధారం. సహకార సంఘాల ద్వారా పంట రుణాలు తీసుకోవడం రైతులకు ఎప్పటినుంచో అలవాటు. సీజన్‌లో రుణాలు తీసుకొని పంట దిగుబడులు రాగానే మళ్లీ వాటిని చెల్లిస్తూంటారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గత ఏడాది ఖరీఫ్, రబీ ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా చేయలేదు. దీంతో, రైతులు దారుణంగా నష్టపోయారు. చాలా మందికి రుణాలు తిరిగి చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా డీసీసీబీ ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ప్రస్తుతం రైతులకు రుణాలిచ్చేందుకు డబ్బులు లేక సహకార సంఘాల అధికారులు తలలు పట్టుకుంటున్నారు. సహకార బ్యాంకు నుంచి తమకు బడ్జెట్ కేటాయిస్తే రుణాలిచ్చేందుకు తమకు అభ్యంతరం లేదని సొసైటీ అధికారులు చెబుతున్నారు. తమకు బడ్జెట్ కేటాయించాలని సొసైటీల అధ్యక్షులు డీసీసీబీ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయితే, డీసీసీబీ పరిస్థితి కూడా అలాగే ఉండటంతో అక్కడి అధికారులు సైతం మీనమేషాలు లెక్కిస్తున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో రూ.1,500 కోట్ల రుణాలు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఖరీఫ్, రబీ సీజన్లలో డీసీసీబీ ద్వారా రైతులకు సుమారు రూ.1,500 కోట్ల మేర రుణాలిచ్చేవారు. ప్రస్తుత ఖరీఫ్‌లో రూ.780 కోట్ల మేర రుణాలివ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా, కిందామీదా పడి ఇప్పటి వరకూ రూ.510 కోట్లు మాత్రమే ఇవ్వగలిగారు. ఒక రైతు తాను తీసుకున్న రుణం చెల్లిస్తేనే కానీ మళ్లీ రుణం ఇవ్వలేని దుస్థితిలో కొన్ని సహకార సంఘాలున్నాయి. మొండి బకాయిల వసూళ్లకు ప్రత్యేక బృందాలను నియమించినా ఫలితం దక్కడం లేదు. దీంతో, రైతులు వ్యవసాయ పెట్టుబడుల కోసం సొసైటీల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కొంత మంది ప్రైవేటు వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకుని, పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది.

సేల్ ఆఫీసర్ల కొరత

రుణాలు తీసుకున్న వ్యక్తులు తమ భూమిని సొసైటీ వద్ద తనఖా పెడతారు. వారు రుణాలు తిరిగి చెల్లించకుంటే డీసీసీబీ అధికారులు సేల్ ఆఫీసర్ ద్వారా సంబంధిత భూమిని విక్రయించి, రుణాలకు జమ చేసుకునే అవకాశం ఉంది. అయినప్పటికీ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. ప్రస్తుతం డీసీసీబీలో ఒక్క సేల్ ఆఫీసర్ కూడా లేకపోవడం గమనార్హం. సహకార శాఖ అధికారులే డీసీసీబీలో సేల్ ఆఫీసర్లుగా ఉంటూ ఈ వ్యవహారం చక్కబెట్టేవారు. ప్రస్తుతం ఉద్యోగుల కొరత కారణంగా డీసీసీబీకి సేల్ ఆఫీసర్లే లేకుండా పోయారు. దీంతో చట్టపరంగా ముందుకెళ్లేందుకు డీసీసీబీ అధికారులు వెనుకంజ వేస్తున్నారు.

ఆ రెండు బ్రాంచిల్లోనే రూ.320 కోట్ల బకాయిలు

ప్రత్తిపాడు, ఏలేశ్వరం డీసీసీబీ బ్రాంచిల్లో భారీగా సుమారు రూ.320 కోట్ల మేర మొండి బకాయిలు పేరుకుపోయాయి. ఏలేశ్వరం బ్రాంచి పరిధిలోని కిర్లంపూడి సొసైటీలో రైతులకు రుణాలివ్వకుండానే బినామీల పేరిట అక్రమార్కులు సుమారు రూ.120 కోట్లు పక్కదారి పట్టించారు. ఇదే బ్రాంచి పరిధిలోని లంపకలోవ సొసైటీలో కూడా బినామీల పేరిట అక్రమార్కులు భారీగా రుణాల సొమ్ము స్వాహా చేసేశారు. ఈ రెండుచోట్లా ఒక్క పైసా కూడా రికవరీ కాలేదు. ఫలితంగా ఈ రెండు బ్రాంచిల పరిధిలోని సొసైటీల్లో ఒక్క రూపాయి కూడా అప్పు పుట్టక నిజమైన రైతులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.



అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

కూటమి అరాచకాలకు మూల్యం తప్పదు

- కార్యకర్తలకు వెన్నంటి నిలుస్తాం
- అభాగ్యులకు అండగా 'డిజిటల్ బుక్'
- ధైర్యంగా క్యూఆర్ కోడ్, ఐవీఆర్ఎస్‌కు ఫిర్యాదు చేయండి
- వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే
- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దాడిశెట్టి రాజా



డిజిటల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న దాడిశెట్టి రాజా. చిత్రంలో వంగా గీత, తోట నరసింహం, దవులూరి తదితరులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కూటమి పాలనలో అన్యాయానికి పాల్పడుతున్న ప్రతి ఒక్కరూ భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోవడానికి సిద్ధంగా ఉండాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా హెచ్చరించారు. కూటమి ప్రభుత్వంలో అన్యాయానికి గురైన ప్రతి వైఎస్సార్ సీపీ కార్యకర్తకు పార్టీ తరఫున డిజిటల్ బుక్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కాకినాడ సిటీ కార్యాలయంలో డిజిటల్ బుక్‌ను రాజా శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కూటమి ఏలుబడిలో అన్యాయానికి గురైన కార్యకర్తలు ధైర్యంగా క్యూఆర్ కోడ్, ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. దీనికోసమే జగన్ ఈ కొత్త వ్యవస్థ తీసుకువచ్చారన్నారు. తుని నియోజకవర్గం బెండపూడిలో వైఎస్సార్ సీపీ కార్యకర్త, కాపు సామాజికవర్గ నేత హత్యకు గురైతే పోలీసులు కేసు నమోదు చేయని దుస్థితి చూశామని గుర్తు చేశారు. అప్పట్లో కోర్టుకు వెళ్లి కేసు నమోదు చేయించుకోవాల్సిన దౌర్భాగ్య పరిస్థితి కూటమి పాలనలో నెలకొందన్నారు. మూడున్నరేళ్లలో వచ్చేది కచ్చితంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వమనే విషయం ప్రజల్లో బలంగా వినిపిస్తోందన్నారు. చివరకు అసెంబ్లీలో కూటమి ప్రజాప్రతినిధులు సైతం కంగారు పడుతున్న విషయం స్పష్టమవుతోందని ఆయన చెప్పారు.

కూటమి దగా పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్య పైనా వైఎస్సార్ సీపీ పోరాడుతుందని రాజా స్పష్టం చేశారు. రైతులకు ఎరువుల సమస్య వస్తే వైఎస్సార్ సీపీ శ్రేణులు ఎక్కడికక్కడ రోడ్డెక్కి, పోలీసు కేసులకు సైతం వెరవకుండా పోరాటం చేయబట్టే రాష్ట్ర ప్రభుత్వం దిగి వచ్చి ఎరువులు దిగుమతి చేసుకుందని చెప్పారు. ప్రజల పక్షాన పోరాడేది వైఎస్సార్ సీపీ మాత్రమేనన్నారు. ప్రతి సమస్యపై స్పందిస్తున్న పార్టీగా రాష్ట్ర ప్రజలంతా వైఎస్సార్ సీపీని చూస్తున్నారన్నారు. టీడీపీ మాదిరిగా ఎన్నికలకు ఆరు నెలల ముందు మాత్రమే తమ పార్టీ బయటకు రాలేదన్నారు. సూపర్ సిక్స్‌లో ఏ పథకాలు వచ్చాయనేది ప్రజలకు తెలియంది కాదని రాజా అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ వంగా గీత, మాజీ మంత్రి తోట నరసింహం, పెద్దాపురం కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు రాగిరెడ్డి అరుణ్ కుమార్ (బన్నీ), మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు, నియోజకవర్గ పరిశీలకులు వాసిరెడ్డి జమీలు, కొప్పన శివనాథ్, ఒమ్మి రఘురామ్, పార్టీ కాకినాడ సిటీ అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శులు రాగిరెడ్డి దీప్తి కుమార్, జమ్మలమడక నాగమణి, ప్రచార సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావూరి వెంకటేశ్వరరావు, పార్టీ అధికార ప్రతినిధి సుంకర సాగర్, బీసీ సెల్ అధ్యక్షుడు అల్లి రాజబాబు, కర్రి వీర్రెడ్డి (చినబాబు), పార్టీ నేతలు యనమల కృష్ణుడు, పసుపులేటి వెంకటలక్ష్మి, రోకళ్ల సత్య తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ దుర్మార్గం



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న లీగల్ సెల్ నాయకులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): వైద్య కళాశాలలను ప్రైవేటీకరించడం కూటమి ప్రభుత్వానికి దుర్మార్గమైన చర్య అని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు కె.ఆదిత్య కుమార్ అన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరించాలనే సర్కారు నిర్ణయానికి వ్యతిరేకంగా లీగల్ సెల్ ఆధ్వర్యాన న్యాయవాదులు కలెక్టరేట్ వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిత్య కుమార్ మాట్లాడుతూ, ప్రతి జిల్లాకు ఒక వైద్య కళాశాల ఉండాలనే ఉద్దేశంతో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయలతో వాటి నిర్మాణం చేపట్టారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు మంజూరు చేయకపోవడంతో ఆ కళాశాలల నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయన్నారు. విద్య, వైద్యం రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ కల్పించిన హక్కని, వీటిని ప్రైవేటుపరం చేయడం సిగ్గుచేటని అన్నారు. కరోనా సమయంలో ప్రభుత్వాసుపత్రుల్లో ఎంతోమంది ప్రాణాలు నిలిపారన్నారు. ఆ సమయంలో ప్రైవేటు ఆసుపత్రులు మాత్రం ప్రజల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేశాయని గుర్తు చేశారు. ఇటువంటి విపత్కర పరిస్థితులు వచ్చినప్పుడు ప్రజలకు ప్రభుత్వాసుపత్రులు ఎంతో మేలు చేస్తాయని ఆదిత్య కుమార్ అన్నారు. ధర్నా అనంతరం జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు లీగల్ సెల్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో లీగల్ సెల్ కాకినాడ సిటీ అధ్యక్షుడు గెద్దాడ వెంకటేశ్వరరావు, నాయకులు విశ్వనాథరెడ్డి, బాలకృష్ణ, నాగేంద్ర, పితాని శ్రీనివాస్, కలిదిండి శ్రీనివాస్, నున్న కృష్ణ, గెద్దం శ్రీనాథ్, జి.వరప్రసాద్, ఎంజీకే రాజు, మహిళా న్యాయవాదులు కళ, ప్రసన్న, శ్వేత పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రైవేటీకరణతో పేదలకు వైద్య విద్య దూరం



కలెక్టర్ మహేష్ కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు గోవిందరావు

అమలాపురం రూరల్: పీపీపీ మోడల్‌లో టీడీపీ పారిశ్రామిక వేత్తలు, తన తాబేదార్లకూ సీఎం చంద్రబాబు ప్రభుత్వ మెడికల్ కళాశాలను అప్పగించడం వల్ల పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తుందని జిల్లా వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు, న్యాయవాది టీవీ గోవిందరావు కలెక్టర్ మహేష్‌కుమార్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. రూ.8 వేల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను ఏడాదికి కేవలం రూ.5 వేలకే ప్రైవేటు సంస్థలకు లీజుకు ఇవ్వడం ద్వారా ప్రజల ఆస్తులను దోచుకుంటున్నారని అన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు కూటమి ప్రభుత్వం టెండర్ నోటిఫికేషన్ విడుదల చేసి తొలి విడతలో నాలుగు కాలేజీలను పీపీపీ పద్ధతిలో అప్పగించేందుకు టెండర్ నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. ఇందులో భాగంగా ఆదోని, మార్కాపురం, మదనపల్లె, పులివెందుల కాలేజీలను అప్పగించేందుకు నోటిఫికేషన్ జారీ చేశారని అన్నారు. మెడికల్ కాలేజీలు, 625 పడకల సూపర్ స్పెషలిటీ ఆస్పత్రుల పీపీపీకి టెండర్లను పిలిచిందని, కమీషన్ల కోసం మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు అమ్మేస్తున్నారన్నారని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. 2019–24 కాలంలో 17 కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణానికి అప్పటి సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలోనే శ్రీకారం చుట్టారని అన్నారు.

ఏ కాటు రేబిస్ కానుందో!

తన చూపులతో.. చేష్టలతో మనుషులను వశం చేసుకునే పెంపుడు జంతువులలో కుక్క ఒకటి. ఒక్కసారి దాని ప్రేమకి లొంగిపోతే పరోక్షంగా ఆ యజమాని లేదా ఆ ఇంటి వారు దానికి బానిసలైపోయినట్టే. దానిని నెత్తినెక్కించేసుకుంటారు. ఈ ప్రేమ, వశం మాటున పెద్ద ప్రమాదం పొంచి ఉందని ఆ దాని మాయలో పడినవారికీ.. ఆ మూగజీవికి సైతం తెలియదు. తెలిసినా ఎక్కువ శాతం ఆ ప్రమాదాన్ని విస్మరిస్తారు. దాని పోషణ ఎంత ముఖ్యమో.. దాని ఆరోగ్య విషయంలోనూ అంతే జాగ్రత్త తీసుకోవాలంటారు వైద్యులు. ఆ జీవి చొంగ కానీ.. కంటి నీరు కానీ ఎంతో ప్రమాదకరమైనవి. మితిమీరి ప్రేమించేవారు దాని ముక్కుమీద.. నోటి మీద ముద్దులిస్తుంటారు. అంతే కాకుండా దానికి అన్నం సైతం నోట్లో పెట్టి తినిపిస్తారు. ఈ విషయంలో అత్యంత జాగ్రత్త వ్యవహరించాల్సిన ఆవశ్యకత ఉంది. దాని నుంచి ఎటువంటి వ్యాధులు సంక్రమించకుండా.. నిర్ణీత కాల వ్యవధిలో ఏఆర్వీ ఇంజెక్షన్లు, టీకాలు, ఏ అనారోగ్యం వచ్చినా మందులు ఇప్పించాలి. లేదంటే ఆ ప్రేమ చూపించే మూగజీవే ప్రాణాంతకం కావచ్చు.



ప్రమాదకరంగా వ్యవహరించే సందర్భంలో..



తన పప్పీ ప్రేమను ఆస్వాదిస్తున్న చిన్నారి

- కుక్కలతో అప్రమత్తం అంటున్న వైద్యులు
- ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 3,794 కేసులు
- నేడు వరల్డ్ రేబిస్ డే

రాయవరం: జంతువులు, మనుషుల్లోను వచ్చే అతి ప్రాణాంతక వ్యాధి రేబిస్. అత్యంత ప్రమాదకరమైన వైరల్ వ్యాధుల్లో ఇది ఒకటి. దీనినే లిస్సా హైడ్రోఫోబియా అని కూడా అంటారు. ఈ వ్యాధి సోకిన జంతువులు కరవడం వల్ల మనుషులకు కూడా ఆ వ్యాధి వ్యాపిస్తుంది. కుక్కకాటు ద్వారా సంక్రమించే అతి పురాతనమైన వ్యాధి ఇది. రేబిస్ నివారణకు ప్రయత్నాలు జరుగుతున్నా నేటికీ అదుపులోకి రాకపోగా చాలా మందిని ఇది పొట్టన పెట్టుకుంటోంది. పిచ్చి కుక్క కరవడం ద్వారా వచ్చే రేబిస్ వ్యాధికి సకాలంలో చికిత్స చేస్తే పూర్తిగా నివారించే వీలుంటుంది.

వ్యాధి లక్షణాలు రెండు రకాలు

■ ఉగ్రరూపం

ఈ దశలో జంతువు విపరీతమైన ఆందోళనగా ఉంటుంది. ప్రతి ఒక్కరినీ విచక్షణా రహితంగా కరుస్తూ యజమానిని గుర్తించలేదు. రాళ్లు, కర్రలు తదితర వాటిని తినడానికి ప్రయత్నిస్తుంది. ఆహారం తినదు. కళ్లు ఎర్రబడి వుండి నోటి నుంచి చొంగ విపరీతంగా కారుతుంది. గొంతు కండరాలకు పక్షవాతం వచ్చి గొంతు బొంగురు పోతుంది. నీరు తాగలేదు. అరుపులో మార్పు వస్తుంది. పిచ్చిగా పరుగులు తీసి గోడలను రుద్దు కుంటుంది. దవడలు బిగుసుకు పోతాయి. సాధారణంగా ఈ లక్షణం పిల్లుల్లో వస్తుంది.

■ మూగతనం

రేబిస్ సోకిన జంతువుకి కింద దవడ వేలాడుతుంది. వ్యాధి లక్షణాలు అంతగా కనిపించవు. ముందుగా పక్షవాతం లక్షణాలు కన్పిస్తాయి. కరవలేదు. కుందేళ్లలో ఈ లక్షణం కన్పిస్తుంది.

ఐదేళ్ల వ్యవధిలో కుక్క కాట్లు, మరణాల సంఖ్య ఇలా

సంవత్సరం	డాగ్ బైట్స్	రేబిస్ కేసులు	రేబిస్ డెత్స్
2021	4,378	0	0
2022	5,562	0	0
2023	5,215	0	0
2024	4,559	1	1

2025 జనవరి నుంచి నేటి వరకు 3,794 కుక్క కాటు కేసులు నమోదయ్యాయి.

వ్యాధి నివారణ చర్యలు

- వ్యాధికి చికిత్స లేదు. వ్యాధి నిరోధక టీకాలు (పోస్ట్ బైట్) వేయించుకోవాలి.
- రేబిస్ సోకిన కుక్క లేదా అడవి జంతువుల ద్వారా అయిన గాయాలకు వెంటనే చికిత్స చేయించాలి. యాంటీ రేబిస్ ఇమ్యునో గాబులిన్స్ ఇప్పించాలి.
- కుక్క కరిచిన గాయాలను శుభ్రంగా డిటర్జెంట్ సబ్బుతో కడగాలి.
- కార్బలిక్ యాసిడ్, టింక్చర్ అయోడిన్‌ను గాయంపై పూయాలి. యాంటీ రేబిస్ ఇమ్యునో గ్లాబ్యులిన్స్ ఇంజక్షన్ ఇవ్వాలి.
- యాంటీ రేబిస్ పోస్టుబైట్ కోర్సు 0, 3, 7, 14, 28, 90 రోజుల్లో క్రమం తప్పకుండా వ్యాక్సిన్ చేయించుకోవాలి.
- పెంపుడు కుక్కల యజమానులందరూ తప్పనిసరిగా తమ కుక్కలకు యాంటీరేబిస్ వ్యాక్సిన్ ఇప్పించేలా చట్టబద్ధం చేయాలి.
- వీధి కుక్కలకు గర్భనిరోధక ఆపరేషన్లు చేసే కార్యక్రమాలను బ్లూక్రాస్ వంటి సంస్థల సహకారంతో చేపట్టాలి.
- ఇతర దేశాలు, ప్రాంతాల నుంచి కుక్కలను తీసుకువచ్చే సమయంలో వాటికి తప్పనిసరిగా వ్యాక్సినేషన్ సర్టిఫికేట్ ఉండేలా చూడాలి.
- రేబిస్ లక్షణాలు, వ్యాప్తి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. అలాగే రేబిస్ కేసుల గురించి తప్పనిసరిగా ఎప్పటికప్పుడు అధికారులకు సమాచారం ఇవ్వాలి.
- వెటర్నరీ, మెడికల్, మున్సిపల్ శాఖలు కలిసికట్టుగా రేబిస్ వ్యాధి నిరోధానికి చర్యలు చేపట్టాలి.

యాంటి రేబిస్ టీకా

పిచ్చికుక్క కరిచిన ఒక బాలుడికి 1885వ సంవత్సరంలో లూయిస్‌పాశ్చర్ అనే శాస్త్రవేత్త మొదటిసారిగా యాంటి రేబిస్ టీకా వేశారు.


పెరిగిపోతున్న కుక్కల సంతతి

ఇటీవలి కాలంలో కుక్కల సంతతి బాగా పెరిగిపోవడంతో పలువురు కుక్కకాటు బారిన పడుతున్నారు. ఈ వ్యాధి వల్ల జిల్లాలో ఏటా వేల సంఖ్యలో కుక్కకాట్లకు గురవుతున్నారు. మనుషులే కాదు పశువులు కూడా కుక్క కాటు బారిన పడుతున్నాయి. జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు 26వ తేది వరకు 3,794 మంది కుక్కకాటు బారిన పడ్డారు. ఈ వ్యాధికి సకాలంలో చికిత్స చేపడితే పూర్తిగా నివారించవచ్చునని వైద్యులు చెబుతున్నారు.

వ్యాధి స్వరూపం ఇదీ..

రేబిస్ వ్యాధి రెబ్డో వైరస్ వల్ల వస్తుంది. ఈ వ్యాధి సోకిన పశువు లేదా జంతువు కరవడం వల్ల ఇది వ్యాపిస్తుంది. రేబిస్ వ్యాధి ఎక్కువుగా కుక్కల వలనే వస్తుంది. వాటిలో లాలాజలం కళ్లు, ముక్కు, పుండు స్రావాల్లో ఉన్న వైరస్ ఆ జంతువు కరచిన ప్రదేశం నుంచి కేంద్ర నాడీ మండలం ద్వారా మెదడుకు చేరి అక్కడ లాలాజల గ్రంధులకు చేరుతుంది. రేబిస్ వ్యాధిని పిచ్చి కుక్క వ్యాధి, హైడ్రో ఫోబియా (నీళ్లంటే భయపడడం) అని కూడా పిలుస్తారు.

వెంటనే వైద్యులను సంప్రదించాలి



కుక్క కాటుకు గురైన వ్యక్తి వెంటనే వైద్యులను సంప్రదించాలి. కుక్క కరిచిన చోట సబ్బుతో 10–15 నిమిషాలు సబ్బుతో కడగాలి. కచ్చితంగా యాంటీ రేబిస్ టీకాలు వేయించాలి. రేబిస్ వ్యాధి నివారణ ఒక్కరి వల్ల సాధ్యం కాదు. కుక్కల సంతతిని వ్యాక్సినేషన్ ద్వారా కట్టడి చేయాలి. మీరు..నేను.. సమాజం అనే స్లోగన్‌తో రేబిస్ నివారణ దినోత్సవాన్ని ఈ ఏడాది నిర్వహిస్తున్నారు.

– డాక్టర్ ఆర్‌బీ ప్రతాప్, జిల్లా సర్వైలెన్స్ అధికారి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

- 220.966 గ్రాముల బంగారం, 8.25 గ్రాముల వెండి వస్తువులు రూ.4.21 లక్షల నగదు స్వాధీనం
- సొత్తు విలువ రూ.9,98,415
- డీఎస్పీ భవ్యకిషోర్

రాజమహేంద్రవరం రూరల్: కరుడుగట్టిన ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేసి వారి నుంచి 220.966 గ్రాముల బంగారం, 8.25 గ్రాముల వెండి వస్తువులు, రూ.4.21 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నామని జిల్లా సౌత్ జోన్ డీఎస్పీ, ఈస్ట్‌జోన్ ఇన్‌చార్జి డీఎస్పీ ఎస్.భవ్యకిశోర్ తెలిపారు. మొత్తం సొత్తు విలువ రూ.9,98,415 ఉంటుందని ఆయన అన్నారు. బొమ్మూరు పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలు వెల్లడించారు. దివాన్‌చెరువు డీబీవీ రాజు లే అవుట్‌లో నివసిస్తున్న క్యానమ్ అన్వేష్ తన తల్లి అస్తికలను గంగానదిలో కలపడానికి గత నెల 24వ తేదీన కాశీ వెళ్లి తిరిగి 27న వచ్చారు. అప్పుడు బీరువాలోని బంగారు వస్తువులు, నగదు చోరీకి గురైనట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బొమ్మూరు ఎస్సై మురళీమోహన్ కేసు నమోదు చేశారు. ఎస్పీ డి.నరసింహకిశోర్ ఆదేశాల మేరకు జిల్లా అడిషనల్ ఎస్పీ(క్రైమ్) అర్జున్ పర్యవేక్షణలో ఈస్ట్ జోన్ డీఎస్పీ ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ పి.కాశీవిశ్వనాథ్‌కు వచ్చిన సమాచారం మేరకు డీఎస్పీ భవ్యకిషోర్ పర్యవేక్షణలో సిబ్బంది ఒడిశా రాష్ట్రం బరంపురానికి చెందిన ప్రస్తుతం భువనేశ్వర్‌లో ఉంటున్న కారాడ ప్రశాంత్‌కుమార్, గంజాం ప్రాంతానికి చెందిన సాగర్‌కుమార్ పాండాను శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీ వద్ద అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

2000 నుంచి నేరాల బాట : నిందితులు ప్రశాంతకుమార్, సాగర్‌కుమార్ పాండాలు 2000 సంవత్సరం నుంచి నేరాలు ప్రారంభించారని డీఎస్పీ భవ్యకిషోర్ తెలిపారు. విశాఖపట్నం పరిధిలో 11, కాకినాడ పరిధిలో నాలుగు, గుంటూరు పరిధిలో మూడు, ఒడిశా బరంపురంలో ఐదు, బైద్యనాథ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు, బడాబజార్ పోలీస్‌స్టేషన్ పరిదిలో ఐదు, గుస్పాన్ నుగవు పోలీసు స్టేషన్ పరిధిలో ఎనిమిది, హైదరాబాద్ కూకట్‌పల్లిలో ఆరు, నాగ్పూర్ ప్రతాప్‌నగర్‌లో ఆరు మొత్తం 56 కేసులు వీరి మీద ఉన్నాయన్నారు. నిందితులను రిమాండ్ కోసం అరో అదనపు ఫస్ట్ క్లాస్‌మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచనున్నట్టు తెలిపారు. ఈ కేసులో ప్రతిభ చూపిన ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథం, ఎస్సై మురళీమోహన్, బొమ్మూరు పీఎస్ హెచ్‌సీ పి.వెంకటేశ్వరరావు, సీసీఎస్ పీఎస్ హెచ్‌సీలు ఎం.ప్రసాద్, డి.వెంకటరమణ, పీసీలు కె.సురేష్ బాబు, ఎ.మణికంఠ, ఎఆర్‌పీసీ బి.హరీష్, వుమెన్ పీసీ పూర్ణిమరాజ్‌లను ఎస్పీ డి.నరసింహకిశోర్ అభినందించారని డిఎస్పీ భవ్యకిషోర్ తెలిపారు.



అరెస్టు చేసిన నిందితులు, స్వాధీనం చేసుకున్న సొత్తుతో డీఎస్పీ భవ్యకిశోర్, ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథం, సిబ్బంది

బాలకృష్ణ వ్యాఖ్యలకు కారణం అదే

- కూటమి పంపకాల్లో తేడాలొచ్చాయి
- చంద్రబాబుకు తెలిసే బాలయ్య వ్యాఖ్యలు
- మాజీ మంత్రి దాడిశెట్టి రాజా



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న దాడిశెట్టి రాజా. చిత్రంలో వంగా గీత, నేతలు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: రాష్ట్రంలో ఏ ఎమ్మెల్యేకూ లేని మెంటల్ సర్టిఫికెట్ బాలకృష్ణకు మాత్రమే ఉందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా అన్నారు. కాకినాడలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన శనివారం పార్టీ నేతలతో కలిసి డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, బాలకృష్ణ ఒక మానసిక దివ్యాంగుడనే విషయం ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ప్రతి ఒక్కరికీ తెలిసిందేనన్నారు. ఈ రోజు కొత్తగా బాలకృష్ణ మానసిక వైకల్యం గురించి చర్చించుకోవాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్ర ప్రజలకు దేవాలయం లాంటి అసెంబ్లీలో బాలకృష్ణ మాట్లాడారు కాబట్టి దీనిపై చర్చించాల్సిందేనన్నారు. బాలకృష్ణ యథాలాపంగా మాట్లాడారని అనుకోవడం లేదన్నారు. ఆయన సాధారణంగా అసెంబ్లీకి రారని, అప్పుడప్పుడు వస్తారన్నారు. ప్రతి రాజకీయ పార్టీకి ఒక లైన్ ఉంటుందని, చీఫ్ విప్ ఆధ్వర్యంలో ముందు రోజు ఎవరెవరు ఏం మాట్లాడాలనే చర్చ జరుగుతుందని చెప్పారు. చంద్రబాబు నోటీసులో లేకుండా బాలకృష్ణ మాట్లాడలేదన్నారు. ఎవరెవరు మాట్లాడతారనే జాబితాను స్పీకర్‌కు చీఫ్ విప్ అందజేస్తారని చెప్పారు. ఎప్పుడూ అసెంబ్లీకి రాని బాలకృష్ణ అప్పుడే హైదరాబాద్ నుంచి అసెంబ్లీకి రావడం, ఆ సభలో ఇలా మాట్లాడటం చూస్తుంటే అదంతా చంద్రబాబుకు తెలియకుండా జరిగిందనుకోవడం లేదని అన్నారు. కూటమిలో వాళ్లలో వాళ్లకు ఏవో ఇబ్బందులుండి ఉంటాయని తాను భావిస్తున్నానన్నారు. కూటమి పంపకాల్లో తేడా కావొచ్చు, లేదంటే కాకినాడ పోర్టులో ×సీజ్ ద షిప్× వసూళ్లలో తేడాలు, పొరపొచ్చాలు వచ్చి ఉండవచ్చని అన్నారు. టీడీపీ వాళ్లు చాలా ప్లాన్డ్‌గానే ఉన్నట్టు దీనిని బట్టి అనిపిస్తోందన్నారు. టీడీపీకి చెందిన ఎమ్మెల్యే బొండా ఉమ జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి కాలుష్య నియంత్రణ మండలి ఉందా లేదా అనే రీతిలో మాట్లాడినా, ఇప్పుడు చిరంజీవిపై బాలకృష్ణ మాట్లాడినా.. అదంతా ఆ రెండు పార్టీల నేతల మధ్య ఏవో వివాదాలు లేకుండా జరగలేదని ప్రజలు అనుమానిస్తున్నారన్నారు. అందుకే మెంటల్ సర్టిఫికెట్ ఉన్న బాలకృష్ణతో ఇలా మాట్లాడించి ఉండవచ్చునని చెప్పారు. ఇవన్నీ చంద్రబాబు తెలివితేటలుగానే భావిస్తున్నామని, ఎందుకంటే పిచ్చోడు ఏదో మాట్లాడేశారని రాష్ట్ర ప్రజలు తేలికగా తీసిపడేస్తారనుకుని ఉంటారని అన్నారు.

చంద్రబాబు అనుకున్న అవుట్‌పుట్ చిరంజీవి, పవన్ కల్యాణ్‌కు ఇవ్వగలిగారన్నారు. కాకినాడ సహా రాష్ట్రంలో జనసేన, మెగా ఫ్యామిలీ అభిమానులు ఏమీ మాట్లాడలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. బాలకృష్ణ వాఖ్యలపై చివరికి చిరంజీవి స్పందించారని, జగన్ తమను గౌరవంగా చూసినట్లు తెలిపారని చెప్పారు. తమ సమస్యలు పరిష్కరించారని కూడా చెప్పారన్నారు. గతంలో జగన్‌మోహన్‌రెడ్డిపై పవన్ కల్యాణ్ బురదజల్లే సమయంలో కూడా చిరంజీవి ఇదేవిధంగా స్పందించి ఉంటే బాగుండేదని రాజా అన్నారు. సమావేశంలో పార్టీ మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వంగా గీత, మాజీ మంత్రి తోట నరసింహం తదితరులు పాల్గొన్నారు.